హైదరాబాద్ వార్త



## రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తేవటానికే అలయ్ బలయ్

**తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షులు కే.పీ.మురళీకృష్ణ**



అలయ్ బలయ్‌లో అభివాదం చేస్తున్న బీసీ నేతలు

హైదరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: రాజకీయాలకు అతీతంగా బీసీలందరినీ ఒకే వేదిక మీదకు తీసుకురావటమే అలయ్ బలయ్ ప్రధాన ఉద్దేశ్యమని తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షులు కే.పీ మురళీ కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో రత్ననగర్ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో భాగంగా అందరూ కలసి మెలసి ఉండాలని గత మూడు సంవత్సరాలుగా ఈ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీసీ కమీషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, సినీ హీరో సుమన్, సి.కృష్ణయాదవ్, మాజీ మంనరతి గౌతం రావు, బీజేపీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు, కార్పోరేటర్స్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అమృత, ఉమారమేష్ యాదవ్, మాజీ కార్పోరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, పద్మావతి, డి.పి.రెడ్డి వనం రమేష్, బిల్డర్ ప్రవీణ్, కన్నా, కుమార స్వామి, నగేష్, లింగం, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

**తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న**

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 27, ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నేడు జరగనున్నదని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్నలు ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ సమీపంలోని ఎస్.కె.గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు సమ్మేళనం జరుగుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చుకునే విధంగా సమ్మేళనంలో తీర్మాణాలు ఉంటాయని వారు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులందరూ సమావేశంలో పాల్గొంటారని వారు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులందరూ విచ్చేసి ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 15లక్షల మంది గల్ఫ్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు



గల్ఫ్ జేపీసీ సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ రవిగౌడ్ తదితరులు

చిక్కడపల్లి అక్టోబరు 27 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రానికి చెందిన 15లక్షల మంది గల్ఫ్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలంగాణ కార్మిక సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు, పరిష్కారాల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వక్తలు అవేదన వ్యక్తం చేశారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్‌లో ఉన్న కార్మికులు, గల్ఫ్ నుంచి వాపస్ వచ్చి గ్రామాల్లో స్థిరపడ్డ వారు, గల్ఫ్ ప్రవాసుల కుటుంబ సభ్యులు ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలని శుక్రవారం జరిగిన ఖతార్ కార్మికుల సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం అభిప్రాయపడింది. శుక్రవారం గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలఉ వాట్సాప్, బోటిం, ఐఎంఒ, ఎఫ్పీ మెసెంజర్ లాంటి యాప్స్ ద్వారా తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు ఓట్లు వేయించాలని కోరారు. జీవో బడ్జెట్ నినాదంతో కార్పొరేట్ రాజకీయ వ్యవస్థను ఎదుర్కోవాలని కోరారు. గల్ఫ్‌బోర్డుతో కూడిన ఎన్నారై పాలసీతో సాధనే తమ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు చెన్నవానేని తిరుపతి యాదవ్, తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్ష/డు మధు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్, ఖతార్ జాగృతి అధ్యక్షురాలు నందిని, బిఆర్ఎస్ ఖతార్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ అబ్బగౌని, దోహా తెలుగు సమితి అధ్యక్షుడు పంచిత ధర్మరాజ్‌యాదవ్, సుందరగిరి శంకర్‌గౌడ్, తాళ్ళపెల్లి ఎల్లయ్య, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీలను గుర్తించిన వారికే మద్దతు

**బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**



సమావేశంలో ప్రసంగిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ధర్నాచౌక్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: బీసీలను గుర్తించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అన్యాయం చేశాయని ఆరోపించారు. బీజేపీ మొదటి జాబితాలో బీసీలకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాత్రం రెడ్లకు, వెలమలకు ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. బీసీలకు 36శాతం టిక్కెట్లు కేటాయించి, బీసీనే ముఖ్యమంత్రి అభ్యర్ధి అని ప్రకటిస్తున్న బీజేపీని చూసి 20శాతం కూడా కల్పించని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బుద్ధి తెచ్చుకోవాలని హితవుపలికారు. బీఆర్ఎస్ ప్రకటించని నాలుగు స్థానాలకు కూడా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునితా లక్ష్మారెడ్డిలకు కేటాయించి రెడ్ల, వెలమ గుత్తాధిపత్యం అయిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలకు మొండి చేయి చూపించి, రెడ్ల పార్టీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రెండవ జాబితాలోనైనా కాంగ్రెస్ పార్టీ బీసీలకు టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ విద్యార్ధి సంఘం కకేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బిసి విద్యారదద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు భాస్కర్‌మెరు, బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నరసింహానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్**

ధర్నాచౌక్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు శిక్షణ తరగతులు శ్రద్ధగా విని, సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్ సూచించారు. శుక్రవారం దోమలగూడలోని ఏవీ కళాశాలలో ముషీరాబాద్ నియోజకవర్గ పీఒ, ఏపీఒ, పోలీస్ సిబ్బందికి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ఎన్నికల ట్రైనింగ్‌క్లాసులను ఎవరూ ఆషామాషీగా తీసుకోకూడదని, కొందరు పీఓలు శిక్షణకు రాకుండా ఓవర్ కాన్ఫిడెన్స్‌తో తప్పుడు చేస్తారని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ప్రతి ఒక్కరూ బాద్యతగా ఉండాలని, తప్పులు జరిగితే క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఆర్ఓ, అధికారులు పాల్గొన్నారు.

# అద్దె ఎంతైనా సరే

**పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు నేతల తిప్పలు**

**ఖాళీ జాగాలను గుర్తించేందుకు ప్రత్యేక టీంల ఏర్పాటు**

**1-2నెలలపాటు అద్దెకు అడ్వాన్సులు చెల్లింపు**



హైదరాబాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త: ఖాళీజాగా కనిపిస్తే చాలు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు పోటీ పడుతున్నారు. ఎన్నిలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీలతోపాటు స్వంతంత్ర్య అభ్యర్థులు నియోజవకర్గాల్లో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు అద్దెభవనాలు వెతుకుతున్నారు. పలు నియోజకవర్గాల్లో కొంత మంది అభ్యర్థులు తమ సొంత స్థలాలు, పార్టీకి చెందిన నేతల స్థలాలను ఒకటిరెండు నెలలు అద్దెకు తీసకుంటూ రాత్రికి రాత్రే కార్యాలయాలు ప్రారంబిస్తున్నారు. శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బినగర్, రాజేంద్రనగర్, ఉప్పల్‌తోపాటు పలు నియోజకవర్గాల్లో ఖాళీ స్థలాల్లో పార్టీల కార్యాలయాలు ప్రారంభిస్తూ అక్కడ నుంచి రోజువారీ ప్రచార కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పోటీ తీవ్రంగా ఉండే నియోజవకవర్గాల్లో అద్దె ఎంతైనా చెల్లిస్తాం. లోకేషన్ అదిరిపోవాలంటూ ముఖ్యనేతలు కార్యకర్తలకు సూచిస్తున్నారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ప్రచారంతోపాటు నిత్యం ప్రజల్లో ఉండే అవకాశాలుంటాయని పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు.

**రాత్రికి రాత్రే రంగులేస్తున్నారు..** పార్టీ కార్యాలయాల ఏర్పాటుతోపాటు అద్దెభవనాలకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. రాత్రికి రాత్రే పార్టీ కార్యాలయాలకు రంగులేస్తూ పార్టీ జెండాలు పాతేస్తున్నారు. స్థానికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్టీ ఆఫీసులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాల ఏర్పాటు బాధ్యతలను ముఖ్యనేతలకు అప్పగించడంతోపాటు ప్రత్యేక టీంలను కేటాయించారు. శివారు ప్రాంతాల్లో అధికంగా ఖాళీ స్థలాల్లో పార్టీ క్యాలయాలు ఏర్పాటు చేస్తూ జెండాలు పెడుతున్నారు.

**ప్రత్యేక అలంకరణాలు..** పార్టీ కార్యాలయాలు ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు ఓటర్లను ఆకట్టుకునేల కార్యాలయం ముందు ద్వారాలను తీర్చి దిద్దుతున్నారు. పార్టీ కార్యాలయాల్లో మంచినీటి సౌకర్యం, కుర్చీలతోపాటు అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యాలయాల్లో 24గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక నాయకు లతో పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తూ ఎన్నికలు పూర్తయ్యేవరకు నిర్వాహణ బాధ్యత వారికి అప్పగిస్తున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల సెకండ్ లిస్ట్









**కూకట్‌పల్లి-బండి రమేష్**
**ఇబ్రహీంపట్నం-మల్‌రెడ్డి రంగారెడ్డి**
**ఎల్‌బినగర్-మధుయాస్కీగౌడ్**
**మహేశ్వరం-కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**
**శేరిలింగంపల్లి-వి.జగదీశ్వర్‌గౌడ్**
**రాజేంద్రనగర్-కస్తూరి నరేందర్**
**అంబర్‌పేట-రోహిణ్‌రెడ్డి**
**ఖైరతాబాద్-పి.విజయారెడ్డి**
**జూబ్లీహిల్స్-మహ్మద్ అజారుద్దీన్**
**కంటోన్మెంట్-జి.వి.వెన్నెల (గద్దర్ కూతురు)**





హైదరాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త : కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారయ్యారు. సెకండ్ లిస్టును ఏఐసీసీ ప్రకటించింది. రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా తొలి జాబి తాలో 55 మందికి స్థానం కల్పించిన ఆపార్టీ, రెండవ జాబి తాలో 45 మందికి అవకాశం కల్పించారు. ఈ జాబితాలో ప్రజా గాయకుడు గద్దర్ కూతురు వెన్నెలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీటు ఖరారు చేశారు. ఎల్‌బినగర్‌కు మధుయాస్కీ గౌడ్, ఇబ్ర హీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, శేరిలింగంపల్లికి జగదీశ్వర్‌గౌడ్, కూకట్‌పల్లి నుంచి బండి రమేష్, అంబర్‌పేటకు రోహిణ్‌రెడ్డి, జూబ్లీహిల్స్ నుంచి అజారుద్దీన్ తదితరులు ఉన్నారు. సునీల్ కనుగోలు టీమ్ ఫీల్ట్ స్టడీ చేసి రూపొందించిన నివేదిక ఆధారంగా విజయావకాశాలు ఉన్న అభ్యర్థులనే ఏఐసిసి ఖరారు చేసింది. పార్టీలో సీనియారిటీ ఉన్న నేతలైనా గెలిచే చాన్స్ లేక పోవడంతో పక్కన పెట్టింది. స్క్రీనింగ్ కమిటీ నాలుగుసార్లు సుదీర్ఘంగా అన్ని నియోజకవర్గాల్లోని తాజా పరిస్థితులను, సమాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని లిస్టును ఫైనల్ చేసింది. ఢిల్లీ చుట్టూ ఎన్నిసార్లు చక్కర్లు కొట్టినా పైరవీలకు తావులేని రీతిలో పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ క్యాండిడేట్లను సెలెక్టు చేసింది.

**అసంతృప్తుల సెగ..** కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తుల సెగ మొదలైంది. కాంగ్రెస్ పార్టీ రెండవ జాబితా ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీ శుక్రవారం అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అంబర్‌పేటకు నూతి శ్రీకాంత్‌గౌడ్ టికెట్ ఆశించారు. అయితే అనూహ్యంగా రోహిణ్‌రెడ్డికి కేటాయించారు. ఎల్‌బినగర్‌లో మల్‌రెడ్డి రాంరెడ్డి టికెట్ ఆశించకగా ఇక్కడ మధుయాస్కీగౌడ్‌కు కేటాయించారు. జూబ్లీహిల్స్ లో అజారుద్దీన్‌కు కేటాయించారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి టికెట్ ఆశించారు. పార్టీలో సీనియర్లకు న్యాయం జరగలేదంటూ పలువురు ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ రాని ఆశావహులు తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. టికెట్ ఆశించి భంగపడినవారు కొందరు కంటతడి పెట్టారు.

**జూబ్లీహిల్స్‌కు అజార్.. ఖైరతాబాద్‌కు విజయారెడ్డి?**

**ఫిల్మ్‌నగర్..** ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యిందిఖైరతాబాద్ నియోజకవర్గానికి పిసిసి ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొ రేటర్, దివంగత పిజెఆర్ తనయురాలు పి.విజయారెడ్డి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఇండియన్ మాజీ క్రికెటర్ టిపిసిసి ఉపాధ్యక్షులు అజారుద్దీన్‌ను ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేశారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా గట్టి పోటీ దారుగా ఉన్న టిపిసిసి అధ్యక్షుడు రేవం త్‌రెడ్డి ప్రధాన అనుచరుడు డాక్టర్ సి.రోహి త్‌రెడ్డిని అంబర్‌పేట నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపిక చేశారు. దీంతో ఇప్పటివరకు ఎడతెగని ఉత్కంఠకు తెరప దించి. ఇదిలా ఉండగా పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయం కార్యకర్తలకు లీక్ కాగానే ఆయా నియోజకవర్గాల్లో విజయారెడ్డి, అజారుద్దీన్ అనుచరులు సంబరపడిపోతున్నారు.

**రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన నరేందర్ ముదిరాజ్**

**నార్సింగి..** రాజేంద్రనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా మణికొండ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌కు కేటాయించినట్లు కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. రెండు మార్లు ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో దిగి ఓటమి పాలైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సైతం ఈ దఫా టికెట్ తనకే ఇవ్వాలని శక్తివంచన లేకుండా ప్రయత్నం చేశారు. కానీ అధిష్టానం ఆయనకు ఈ సారి మొండి చెయ్యి చూపింది. నరేందర్ ముదిరాజ్‌కు టికెట్ దక్కడంతో మణికొండలోని కస్తూరి నరేందర్ ఇళ్లు, కార్యాలయాల వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కోలాహలం కనిపిస్తుంది. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తున్నానని, సర్పంచ్‌గా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మణికొండ మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. పార్టీ ఆదేశించిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం వలన ఈ సారి నాకు అధిష్టానం ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చిందని, ఇందుకు జీవితాంతం కాంగ్రెస్ అధిష్టానంకు ఋణపడి ఉంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్, జూనియర్ నాయకులందరిని కలుపుకొని ఎన్నికల్లో ముందు కెళ్తానని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట వంటిదని, ఈ సారి హస్తగతం చేసుకొని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుతత్వాలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలను, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేస్తామని, రాజేంద్రనగర్‌లో గెలిచి తీరుతామని నరేందర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.

## దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఎదరొడ్డి పోరాడే సైనికులలో సిక్కులే

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త : దేశరక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎదురొడ్డి పోరాడే సైనికుల్లో అత్యధికులు సిక్కులేనని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం అమీర్‌పేటలోని అతిథి హోటల్, అమీర్‌పేట సిక్కు సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా మిలన్ (ఆత్మీయ సమావేశం)లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సిక్కు సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కే తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. అభివృద్ధి అంటే తలసాని, తలసాని అంటే అభివృద్ధి అని సతన్‌నగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి నిరూపించారని ప్రశంసించారు. ఏ సమయంలోనైనా ఎలాంటి అవసరమున్నా అండగా నిలిచే గొప్ప నాయకుడు తలసాని అని కొనియాడారు. అలాంటి నాయకుడు తమకు ఉండటం మా అదృష్టమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో సిక్కు సమాజ్ మొత్తం మంత్రి వెంటే ఉంటుందని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలువుతున్నాయని అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి 10 సంవత్సరాలలో చేశామని వివరించారు. ఇక్కడి నుండి గెలిచి ముఖ్యమంత్రిగా చేసిన మర్రి చెన్నారెడ్డి కూడా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అటు తరువాత ఇక్కడి నుండే గెలిచిన ఆయన కొడుకు ఎన్నికల అనంతరం ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని పేర్కొన్నారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆయుధాల బ్యాగ్ చోరీ

**నిందితుడి అరెస్టు.. పోలీసులను అభినందించిన డిజిపి**

కంటోన్మెంట్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ చిల్లర దొంగ సి.ఆర్.పి.ఎఫ్.కానిస్టేబుల్ ఆయుధాల బ్యాగ్‌ను చోరీ చేయడంతో పోలీసులను పరుగులు పెట్టించాడు. 24 గంటల్లో దొంగిలించిన ఆయుధాల బ్యాగ్‌ను పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రాయణ గుట్టలోని సి. ఆర్.పి.ఎఫ్ 95 బెటాలియన్‌కు చెందిన నలుగురు కానిసస్టేబుళ్లు విధి నిర్వాహణలో భాగంగా ఉత్తర ప్రదేశ్‌కు వెళ్లేందుకు ఈ నెల 24న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. దానపూర్ ఎక్స్‌ప్రెస్ రైల్ ఎక్కేందుకు ఫ్లాట్‌ఫారంపై వేచి ఉన్న సమయంలో ఆయుధాల బ్యాగ్‌ను దొంగ ఎత్తుకెళ్ళాడు. ఆ తరువాత గమనించిన కానిస్టేబుళ్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగిలించిన బ్యాగ్‌లో 60 రౌండ్ల బులెట్లు, 2 మ్యాగ్జిన్‌లు ఉన్నాయి. సి.ఆర్.పి.ఎఫ్ 95 బెటాలియన్ కానిస్టేబుళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.ఆర్.పి.తో పాటు రైల్వే రక్షణ దళానికి చెందిన సిబ్బంది 8 బృందాలుగా ఏర్పడి దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోని సీసీ కెమరాల అధారాలతో చల్లర దొంగ శ్రీకాకుళానికి చెందిన ఆనందమూర్తిగా పోలీసులు గుర్తించారు. దొంగిలించిన ఆయుధాల బ్యాగ్‌తో పాతగాంధీ ఆసుపత్రి ప్రాంగణంలోని మెట్రో స్టేషన్ వద్ద దొంగ ఆనందమూర్తిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగిలించిన బ్యాగ్‌లో అయుధాలు ఉండడంతో మెట్రోఫిల్లర్ వద్ద పడేశానని తెలిపాడు. మెట్రో ఫిల్లర్ వద్ద ఉన్న సీసీ కెమరాల ను పరిశీలించగా అ బ్యాగ్‌ను ఓ వృద్ధుడు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన అ వృద్ధుడు సత్య నారాయణ వద్ద ఉన్న దొంగిలించిన బ్యాగ్‌ను పోలీససులు స్వాధీనం చేసుకొని 24 గంటల్లో కేసును చేధించిన పోలీసులను డిజిపి అభినందించారు.

## తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

**ములుగు ఎమ్మెల్యే సీతక్క**



అంజన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క

ధర్నాచౌక్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం వల్ల ఒక్క కేసీఆర్ కుటుంబం మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజలందరూ లబ్ధి పొందాలంటే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా కవాడిగూడలో ప్రారంభించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం తెచ్చింది, మనకి రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని ఆమె గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో మానిఫెస్టో రూపొందించిందని, ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. అవినీతి మయమైన కాళేశ్వరం, వాస్తు పేరుతో సెక్రటేరియట్ లాంటివి నిర్మించి ప్రజల ధనం కొల్లగొట్టారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర సంపదను పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభ్యర్ధి ఎం.అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పోరేటర్‌లు కల్పనాయాదవ్, వాజిద్‌హుస్సేన్, నాయకులు వి.డి.కృష్ణ, పోతరాజు భాస్కర్, పి.లక్ష్మణ్, ప్రభాకర్, సూర్యచంద్రశేఖర్, శశికళ, రమేష్, రాము, అంజయ్యగౌడ్, మల్లేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్ మధుమతి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి 600 మంది చేరిక



కార్యకర్తలకు కండువాల కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తలసాని, చిత్రంలో కాలేరు, పద్మా, విజయ్ కుమార్‌గౌడ్

సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త: సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 600 వందల మంది బిజెపి అనుమాయులు శుక్రవారం బాగ్అంబర్‌పేట సీఈ కాలనీలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ఇంచార్జ్ గంగ్ర మోహనరావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి తలసాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చిత్తశుద్ధికి అకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో నిత్యం వందలాది మంది చేరుతున్నారని చెప్పారు. తెలంగాణ కోసం కెసిఆర్ అలుపెరగని పోరాటం చేసి ఉద్యమంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంను పాలించే హక్కు బిఆర్ఎస్‌కే ఉందని రాష్ట్ర ప్రజలు అంగీకరిస్తున్నారని స్పష్టం చేశారు. దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలోకి ఎక్కిందని, అందరి సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని వచ్చే ఎన్నికల్లో మూడోవ సారి ప్రజలు బిఆర్ఎస్‌కు పట్టం కట్టబోతున్నారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లా డుతూ గత పదేళ్ళ కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అంబర్‌పేట నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేనంతగా అభివృద్ధి చేశామని, చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని పార్టీలు బిసి ముఖ్యమంత్రిని ప్రకటించాలి

**బిసి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్**



మీడియాతో మాట్లాడుతున్న రాజ్‌కుమార్, భూపేష్‌సాగర్

హైదరాబాద్, అక్టోబరు 27,ప్రభాతవార్త: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నిపార్టీలు బిసి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని బిసి యువజనసంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం గ్రేటర్ అధ్యక్షులు భూపేష్ సాగర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల్లో గెలిచిన ఎస్సీ,ఎస్టీ బిసి మైనార్టీలు అందరూ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి బహుజన ప్రభుత్వ ఏర్పాటు చేయాలన్నారు. పార్టీలు ప్రకటించే మానిఫెస్టోలో బిసిలపట్ల వైఖరిని స్పష్టం చేయాలని లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బిసి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న రాజకీయ పార్టీలను భూస్థాపితం చేస్తామన్నారు. అలాగే అన్నిరాజకీయ పార్టీల్లో పోటీ చేస్తున్న బిసి అభ్యర్థుల గెలుపునకు బిసిసంక్షేమసంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సి.రాజేందర్,విద్యార్థి సంఘం అధ్యక్షులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం

ధర్నాచౌక్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పాలనతోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. శుక్రవారం కవాడిగూడలోని కుమ్మరి సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ జాయినింగ్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిధిగా హాజరై బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చిన కొంతమంది నాయకులను ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

## బిఆర్ఎస్ హాయంలోనే అభివృద్ధి: ఎమ్మెల్యే మాధవరం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 27, ప్రభాతవార్త : బాలానగర్ వాసుల కష్టాలను గత 60ఏళ్ళుగా ఏ పార్టీ పట్టించుకోలేదని బిఆర్ఎస్ హాయాంలోని అభివృద్ధి జరిగిందని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం బాలానగర్ డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం తెలంగాణ గార్డెన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 60ఏళ్లుగా బలాగనర్ వాసుల కష్టాలను కాంగ్రెస్ కానీ, బీజెపి కానీ పట్టించుకున్న పాపాన పోలేదని, ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు బాలానగర్ వాసుల కష్టాలను తీర్చిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. దశాబ్దాలుగా ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బంది పడుతున్న బాలానగర్ వాసులకు 400కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మించడమే కానీ అలాగే కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి ఎన్నో అడ్డంకులు సృష్టించినా పరిష్కారం కానీ రోడ్డు సమస్యను దిల్కుష్ నగర వాసులకు పరిష్కరిచడం జరిగిందన్నారు. ఇందిరానగర్ వాసులకు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించడం వంటి చరిత్రాత్మకమైన పనులు సంకల్ప బలంతో ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో పూర్తి చేశామని ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడేది బిఆర్ఎస్ పార్టీ

ఎమ్మెల్యే కెపి వివేకానంద


సమావేశంలో పాల్గొన్న కెపి వివేకానంద, ఏఎంఐఎం పార్టీ శ్రేణులు

కొంపల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త : రాష్ట్రంలో ముస్లి మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీయేనని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కెపి వివేకానంద్ పేర్కొన్నారు. శుక్రవారం కొంపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఎంఐఎం పార్టీ అధినేత అక్బరుద్దీన్ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల్లో ఏఎంఐఎం పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇంచార్జీ, ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ హాజరై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కెపి వివేకానందకు తమ సంపూర్ణ మద్దతును ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం ఆలోచించి వారి సమస్యలను తీర్చే పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం బిఆర్ఎస్ పార్టీయేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ అధ్యక్షుల మహమ్మద్ మునీరుద్దీన్, నాయకులు ఫక్రు, మతిన్, అక్బర్, యాకూబ్, అజార్, జిలాని, కబీర్‌ఖాన్, అమీర్‌ఖాన్, సలీం, అఫ్జల్, ఆదిల్, నబీ, అబూ బాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో ఇంటింటికి కేసిఆర్ పథకాలు అందాయి : లాస్య


1వ వార్డు బోయిన్‌పల్లిలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య,జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నకంటోన్మెంట్‌లో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్య మంత్రి కేసిఆర్‌కే దక్కిందని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. శుక్రవారం 1వ వార్డులోని బోయిన్‌పల్లి పెద్ద తోకట్ట, కట్టెల మండి కంసరి బజార్, చింతల్ బస్తీ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయన్నారు. సిఎం కేసిఆర్ ప్రకటించిన ప్రజా మేనీ ఫెస్టోను చూసి ప్రతిపక్షాల్లో వణుకు మొదలైందన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితను కంటోన్మెంట్‌లో లక్ష మెజార్టీతో గెలిపిస్తామా దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, ప్రభుగుప్త,అరుణ్ యాదవ్, రామక్రిష్ణ, మీనా భాస్కర్,శ్రీనివాస్, అసీన్‌ఖాన్, ఇర్ఫాన్, నవీన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో చేపట్టే బాధ్యతలపై శిక్షణ

గోషామహల్, అక్టోబర్ 27ప్రభాతవార్త: తెలంగాణ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గోషామహల్ నియోజకవర్గంలోని బిఎల్ఓ,విఆర్ఓలు,సూపర్‌వైజర్లుకు ఎన్నికలల్లో చేపట్టే బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. కోఠిలోని ఉస్మానియా ఉమెన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన గోషా మహల్ నియోజకవర్గం ఎన్నికల అధికారులకు,సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వరకు నూతన ఓటర్ నమోదుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు.అంతలోపు ఫారమ్-6 ద్వారా నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు.ఈసమావేశంలో జిహెచ్ఎంసి సర్కిల్ 14వ సర్కిల్ డిప్యూటి కమీషనర్ బాలయ్య,ఏఆర్ఓలు,బిఎల్ఓలు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## బండ్లగూడ కార్పోరేషన్ నుంచి ప్రకాశ్‌గౌడ్‌కు భారీ మెజారిటీ ఇవ్వాలి

మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్


బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

నార్సింగి, అక్టోబర్ 27 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ అసెంబ్లీ బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌కు ఈ దఫా బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నుంచి భారీ మెజారిటీ ఇచ్చేలా ప్రతీ నాయకుడు, కార్యకర్త కష్టపడాలని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్‌లతో కలిసి మేయర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వెనువెంటనే పరిష్కరించిన జన నాయకుడు ప్రకాశ్‌గౌడ్ అని, ఆయన గెలుపు కోసం మనమంతా సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. పని చేసే నాయకుడికి పదవి ఇస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ప్రకాశ్‌గౌడ్ ఋజువు చేశారని, ఈ సారి లక్ష మెజారిటీ వచ్చేలా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కష్టపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శిలు అందరూ పాల్గొన్నారు.

## ఆకాశవాణి ద్వారా చిన్నారులకు కళల్లో అవకాశం హర్షణీయం

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి


విజేతలకు బహుమతులందజేస్తున్న రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, అక్టోబరు 27 ప్రభాతవార్త : ఆకాశవాణి అమ్మఒడి, దేవాలయం లాంటి దూరదర్శన్‌లలో వీటిలో చిన్నారులు వర్ధిష్ట కళాకారులకు అవకాశాలు కల్పించాలన్న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ వి.ఉదయశంకర్ ఆలోచన అభినందనీయమని పిల్లలు అందిపుచ్చుకోవాలని ఆ కార్యక్రమానికి సంస్కృతి అనే పేరుపెట్టడం ఎంతో సముచితంగా ఉంటుందని సూచించిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ డా. కె.వి.రమణాచారి ప్రతీఒక్కరూ స్వలాభం విడనాడి తనకోసం కాకుండా పరుల గురించి పాటుపడేవారికి భగవంతుడి కరుణ కృప ఎల్లవేళలా మెండుగా ఉంటుందని, ఎదుగుదలకు తోడ్పడుతుందని స్పష్టం చేశారు. చిన్నారులకు కార్టూన్, భాగవత పద్యగాన పోటీలు పెద్దయెత్తున నిర్వహించి వారికి నగదు బహుమతులందించి ప్రోత్సహించడం హర్షదాయకమని అన్నారు. జి.సత్యనారాయణ స్వాగతోపన్యాసంలో సాంస్కృతిక, సామాజిక, మంచి స్పృహ కలిగిన కార్యక్రమాలను గత 27ఏళ్లుగా నిర్వహిస్తు ప్రోత్సహిస్తున్నామని సవివరపరిచారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సత్కళాభారతి ఆధ్వర్యంలో ప్రముఖ సినీగాయకుడు, సంగీత దర్శకుడు నేమాని పార్థ సభాధ్యక్షతన వైభవంగా నిర్వహించిన సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు వి.ఉదయశంకర్, దైవజ్ఞశర్మ, పి.దక్షిణామూర్తి, మృత్యుంజయ, పి.రాము, సంస్థ అధ్యక్షుడు జి.సత్యనారాయణ తదితరులతో కలిసి సత్కళాభారతి 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉభయ తెలుగురాష్ట్రాలకు పిల్లలకు నిర్వహించిన కార్టూన్, భాగవత పద్యగాన పోటీలలో విజేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు 3, 2, వెయ్యి రూపాయల చొప్పున, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకం కింద ఒక్కొక్కరికి 500 రూపాయల చొప్పున నగదు బహుమతులను ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు.

## రేవంత్‌రెడ్డిపై పోటీకి కట్టుబడి ఉన్నా : కాంగ్రెస్ బృహిష్కృత నేత మనోహర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎన్నికల్లో పోటీకి తాను కట్టుబడి ఉన్నానని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ టిక్కెట్‌ను ఆశించిన తనను ఏకపక్షంగా పార్టీ నుండి బహిష్కరించిన రేవంత్‌రెడ్డి తన నియంతృత్వ పోకడలతో పొన్నాల లక్ష్మయ్య, రాగిడి లక్ష్మారెడ్డి లాంటి ఎంతో మంది సీనియర్లకు, పలు నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఆశించిన వారికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై పోటీ చేసి ఓడించడానికి కృషి చేస్తానని మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బూత్‌స్థాయి సమావేశాలు

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త : 2023 ఎలక్షన్స్ సందర్భంగా 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో శుక్రవారం అయోధ్యనగర్‌లో సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.జోసెఫ్ (యేసు) ఆధ్వర్యంలో అయోధ్యనగర్ కాలనీ, వెల్ఫేర్ కమిటీ వారితో సమావేశం ఏర్పాటు చేసి రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కెపి వివేకానంద్‌ను బలపర్చవలసిందిగా కోరారు. కాలనీ వాసులు సంతోషంతో తమ సంపూర్ణ మద్దతు కెపి వివేకానంద్ కేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 132 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఎలక్షన్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు, అయోధ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమా నర్సయ్య, రాజకుమార్, ఉమేష్‌సింగ్, జ్ఞానేశ్వర్‌చారీ, సత్యనారాయణ చారీ, బి. లింగం, మహిళా నాయకురాలు ఎం.నర్మద, జ్యోతి, ఎస్తేర్, అంజమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## కూన శ్రీశైలంగౌడ్‌కు పరామర్శ


శ్రీశైలంగౌడ్‌ను పరామర్శిస్తున్న మురళీధర్‌రావు

పేట్ బషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త : ప్రజల్లో బిజెపిపై పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద, బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై దాడి చేశాడని మురళీధర్ రావు అన్నారు. ఒక శాటిలైట్ ఛానల్ నిర్వహించిన డిబేట్ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి కెపి వివేకానంద్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై భౌతికంగా దాడి చేయడాన్ని బిజెపి నేత మురళీధర్‌రావు ఖండించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కెపి వివేకానంద్‌కు ఓటమి భయం పట్టుకుందని, ఓడిపోతానని భయంతోనే శ్రీశైలంగౌడ్‌పై దాడి చేశాడని అన్నారు.

## ఉద్యమకారుల సమావేశం



గోషామహల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: గోషామహల్ నియోజక వర్గానికి చెందిన ఉద్యమ కారులు తెలంగాణ సాధనలో ప్రధాన పాత్ర పోషించినట్లు తెలంగాణ ఉద్యమ కారులు పేర్కొన్నారు. ఈ మేరకు త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30వ తేదిన జరగనున్న ఎన్నికల్లో ఉద్యమకారులు, ప్రస్తుత బిఆర్ఎస్ నాయకుల పాత్ర అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. అధిష్టానం టిక్కెట్ ఎవరికి కేటాయించిన సమిష్టిగా ప్రచారం నిర్వహించి అభ్యర్థి గెలుపుకోసం పాటుపడుతామ న్నారు. టిక్కెట్ ఎవరికి వస్తాదో తెలియదు. కాని దాదాపు 20సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో ఎలాంటి పదవులను ఆశించకుండా కొనసా గుతున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో గోషామహల్ నియోజక వర్గానికి చెందిన ఉద్యమకారులు రవి రవీందర్‌చారి, గడ్డం యాదగిరి,కె.దత్తు, వాసుదేవరావు, రమేష్ గుప్త, భూపేందర్,వినోద్‌యాదవ్, ఈశ్వర్, అశోక్‌ముదిరాజ్, రాజ్‌కుమార్,వికాస్ పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం


కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి అభ్యర్థి వై.నరేష్ బిజెపి నాయకులు రమేష్ యాదవ్

చార్మినార్,అక్టోబరు 27 ప్రభాతవార్త : ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నారని బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి అభ్యర్థి వై.నరేష్ అన్నారు.భాగ్యనగర్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు బి.రమేష్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు కలిసి శుక్రవారం అలియాబాద్‌లో బహదూర్‌పుర నియోజకవర్గం బిజెపి అభ్యర్థి నరేష్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఐఎం,బిజెపిల మధ్యనే పోటీ ఉంటుందని,రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి తప్పకుండ వస్తుందని తెలిపారు.బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ హాయాంలోనే రాష్ట్రం అభివృద్ధి


బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చార్మినార్,అక్టోబరు 27 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ దూద్‌బౌలి డివిజన్‌లో పర్యటించారు. దూద్‌బౌలి వాసవి భవనంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు కలిసి రాజేష్ కుమార్‌ను శాలువ కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తమ మద్దతును తెలుపుతునా న్నరని,కాం గ్రెస్ పార్టీ హాయాంలోనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని తెలిపారు.

## 119 స్థానాల్లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ పోటీ

సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ మాట్లాడుతూ ఇప్పటికే తమ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికి 'ముస్లిం దేశవ్యాప్త చైతన్య యాత్ర' నిర్వహిస్తున్నామని, 12 శాతం విద్య, ఉద్యోగంతోపాటు అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి 7,500 రూపాయలు వృద్యాప్య, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ అందిస్తామని, విద్యా, ఉద్యోగ రంగాలలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు ముఖ్యంగా ముస్లింలకు 12 శాతం, షేక్, సయ్యద్, పఠాన్‌లకు కూడా రిజర్వేషన్‌లు అందిస్తామని, రాజకీయ రంగంలో అన్ని సీట్లులో 12 శాతం రిజర్వేషన్‌లు, డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయాలు ఉచితంగా రుణ మాఫీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బాబార్, సయ్యద్ సైదా, షేక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## దళితుడ్ని సిఎంగా చేస్తామని ప్రకటించిన రాజకీయ పార్టీకే మద్దతు

తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం


అభివాదం తెలుపుతున్న టి-ఎంఆర్‌పిఎస్ నాయకులు

సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే దళితుడ్ని సిఎంగా చేస్తామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే తమ సంపూర్ణ మద్ధతు ఇస్తామని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం (టి-ఎంఆర్‌పిఎస్) ప్రకటించింది. అలాగే అన్ని రాజకీయ పార్టీలు మాదిగల కోసం ప్రత్యేకంగా ఒక మ్యానిఫెస్టోను రూపొందించి ప్రకటించాలని సంఘం కోరింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ముల సంపత్‌మాదిగ, కుంకుసాల సంపత్‌మాదిగ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా అధికంగా ఉందని, జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు తగినన్ని సీట్లు కేటాయించాలని, దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్ళు దాటినా అభివృద్ధి, సంక్షేమంలో ఏలాంటి మార్పులేదని, ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉందని ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పోతగల్ల శ్రీనివాస్‌మాదిగ, నాగరాజుమాదిగ, శివమాదిగ, శ్రావణ్‌మాదిగ, ఎర్రోళ్ళ వెంకటేష్‌మాదిగ, మహిళా విభాగం అధ్యక్షురాలు దాసరపు ఎల్లవ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట డివిజన్‌లో ఇంటింటి ప్రచారం


మాతాజీనగర్ లో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పోరేటర్ మహేశ్వరి, డివిజన్ అధ్యక్షుడు పొన్నబోయిన

బేగంపేట అక్టోబరు 27,ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి జరిగిందని, బేగంపేట డివిజన్ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బేగంపేట డివిజన్ పరిధిలోని మాతాజీనగర్ లో కార్పోరేటర్ మహేశ్వరి బేగంపేట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్ యాదవ్ ల ఆధ్వర్యంలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు ఉన్న సమయంలో బేగంపేట డివిజన్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం,నూతన డ్రైనేజీ లైన్ల ఏర్పాటు వంటి ఎన్నో మౌళిక వసతుల కల్పనకు ఆయన భారీ ఎత్తున నిధులు ఖర్చు చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టీ.శ్రీహరి,రాజయ్య,నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ

బేగంపేట అక్టోబరు 27,ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలో ఆమె పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఎన్నో ఉన్నాయని,ప్రభుత్వ పథకాల అమలులో పూర్తి వివక్ష చూపిస్తున్నారని ఆమె ఆరోపించారు.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో నిల్చిన గెలిపించాలని కోరారు.

## అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత


ప్రచారంలో పాల్గొన్న కార్పోరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పాటుపడిన మాధవరం కృష్ణారావు మళ్ళీ ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రజలు సహకరించాలని కూకట్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దయార్‌గూడలో ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పోరేటర్ జూపల్లి సత్యనారాయణ, స్థానిక డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులను, కూకట్‌పల్లి డివిజన్‌లో అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు అధికారం కాంగ్రెస్ పెట్టిన భిక్ష

తార్నాక, అక్టోబర్ 27 ప్రభాతవార్త: బీఆర్ఎస్ తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉందంటే అది కాంగ్రెస్ పెట్టిన రాజకీయ భిక్ష అని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదం సంతోష్‌కుమార్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి తార్నాక డివిజన్ ఆర్యనగర్, లాలాగూడ తధితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. లాలాగూడ మసీదు వద్ద ఆయన మైనార్టీలతో మాట్లాడారు. వారు మద్దతుతెలుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆదం విజయ్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను మాణికేశ్వరీనగర్‌లో ఆసుపత్రి కోసం ప్రజలు పెద్ద ఎత్తున అడ్డుకున్నారని ఇదే ఆయన చేసిన అభివృద్ధికి నిదర్శనం అన్నారు. ఆయన ఎక్కడ అభివృద్ధి చేయలేదని కార్యకర్తలు, నాయకులను,తెలంగాణ ఉద్యమ కారులను పట్టించుకోని నాయకుడు పద్మారావు అని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామినిచ్చారు. 9 ఏండ్లు గడిచినా అడ్డగుట్టలో డ్రైనేజీ సమస్య తీరలేదన్నారు. నాలాల ఆధునీకరణ జరుగలేదన్నారు. సమస్యల పరిష్కారం, అభివృది కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ ఆదం ఉమాదేవి, జీడీ అమర్ నాథ్ గౌడ్, ఎల్ఎల్‌బీ శ్రీనివాస్, హర్షద్, శైలెందర్, బ్రహ్మజీ, గణేష్ యాదవ్, రవి, అశోక్, దాడిగ సందీప్ రాజ్, జయరాజ్, అనిల్, బబ్లూ, చక్రదర్, షకీల్ ఖాన్, వెన్ను నర్సింగ్‌రావు, వేముల శ్రీనివాస్, వరికుప్పల రవి, ఏసీ నర్సింహ్మా, లింగయ్య, వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జిల్లా ప్రచారం కార్యదర్శిగా శ్రీరామ్ శివకుమార్ నియామకం

సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటి కో-ఆర్డినేటర్‌గా శ్రీరామ్ శివకుమార్ నియమితులైనారు. ఈ మేరకు టి-పిసిసి ప్రచార కమిటి ఛైర్మన్ మధుయాష్కిగౌడ్ ఆయనకు నియామ కపత్రాన్ని అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో పోటి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు.

## నిజాయితీపరులకే ఓటు వేయాలి

సైఫాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త: కల్లబోల్లి మాటాలకు నమ్మి ఎవరికి పడితే వారికి ఓటు వేయరాదని, నిజాయితీ పరులైన వ్యక్తులకే ఓటు వేయాలని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. సాధ్యం కాని హామీలతో ఓటర్లను అకట్టుకునేందుకు అభ్యర్థులు ముందుకు వస్తున్నారని, నిజాయితీపరులైన వ్యక్తులను గుర్తించి తమ అమూల్యామైన ఓటు వేయాలని ఆయన కోరారు.

## బిజెపి అభ్యర్థి టి.రాజాసింగ్ ప్రచారం


ఎన్నికల ప్రచారంలో బిజెపి అభ్యర్థి టి.రాజాసింగ్‌ను సన్మానించిన భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

బేగంబజార్,అక్టోబర్ 27ప్రభాతవార్త: ఎన్నికల ప్రచారంలో భాగంగా గౌలిగూడ,రామమందిరం తదితర ప్రాంతాలల్లో గోషామహల్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి టి.రాజాసింగ్ ప్రచారం చేపట్టారు.ఈసందర్భంగా గౌలిగూడ సమీపంలో రాజాసింగ్‌ను శాలువ కప్పి తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్త శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేనా ప్రతినిధులు అశీష్ అగర్వాల్, బిజెపి నాయకులు బోయినివెంకటేష్‌యాదవ్, రవియాదవ్,శైలేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## మద్దతు తెలపాలి


హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న శ్రేణులు

పేట్ బషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు, మాజీ డీసీసీ ప్రెసిడెంట్ కూన ప్రతాప్‌గౌడ్‌ను, యువజన నాయకులు కూన విశాల్‌గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కెం ప్రతాప్ పూర్తి మద్దతు ఇస్తానని గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. అనంతరం కొలను హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ కార్యర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## 20కేజీల గంజాయి స్వాధీనం

నేరేడ్‌మెట్ అక్టోబర్27 ప్రభాతవార్త: తెలంగాణలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న తనిఖీల్లో డబ్బులు, ఇతర వస్తువలను పోలీసుల సా ్వధీనం చేసుకోవడం జరుగుతుంది. శుక్రవారం మల్కాజగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏపి అండ్ ఇఎస్ ముకుందరెడ్డి పర్యవేక్షణలో, మల్కాజిగిరి డిటిఎఫ్, ఎస్‌టిఎఫ్, మల్కాజిగిరి ఎస్ఫోటి, మల్కాజిగిరి ఎస్.హెచ్.ఓలతో కూడిన బృందం మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా మహేంద్ర సేథి అనే వ్యక్తి అనుమానస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద నుండి 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఒడిస్సా నుండి నగరానికి అక్రమంగా ఈ గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి పలు రకాల వస్తువులను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్స్‌పెక్టర్లు భరత్‌భూషన్, లక్ష్మణ్ సింగ్, కుమారస్వామి, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతినగర్‌లో బిఎస్‌పి పాదయాత్ర

చిక్కడపల్లి, అక్టోబరు 27 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇంచార్జ్, ముషీరాబాద్ అభ్యర్థి పోచగారి నరేందర్ అన్నారు. డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీవాసులు వాళ్లెదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ప్రస్తావించారు.

## లక్ష మెజారిటీతో గెలిపించుకుందాం : నర్సిహ్మా


నార్సింగిలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఆర్.నర్సిహ్మా

నార్సింగి, అక్టోబర్ 27 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో వరుసగా నాలుగో సారి నిలిచిన ప్రకాశ్‌గౌడ్‌ను లక్ష మెజారిటీతో గెలిపించుకుందామని గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్‌తో కలిసి నర్సిహ్మా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకాశ్‌గౌడ్ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహం, చేయాల్సిన ప్రచారం తదితర అంశాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశామన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ సర్కారు హాయాంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పతకాలు ఈ సారి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ఎన్నికల వేళ జోలె పట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్న ప్రతిపక్షాల మాటలను ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు గొల్ల నాగేష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, ముస్తాక్, మహిళా అధ్యక్షురాలు ప్రియదర్శిని, మహ్మూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగుర వేస్తాం : మంత్రి హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు తదితరులు

**తుర్కయంజాల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపల్‌లోని బిఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు క్యామ మల్లేష్ ముఖ్యఅతిథులుగా విచ్చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి ఆదరించి గెలిపిస్తే ప్రజలు ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధిచేసి చూపిస్తామన్నారు. నియోజకవర్గంలో ఏడేళ్లకాలంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేసామన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో అంతర్జాతీయ కంపెనీలు ఏర్పాటు చేయడంతో నిరుద్యోగులు, యువతకు ఉపాధి లభించిందన్నారు. బిఆర్ఎస్ సంక్షేమ పథకాలతో ప్రతి నిరుపేద అభివృద్ధి చెందాడని, ఇప్పుడు సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో పేదల జీవితాలు బాగుపడతాయన్నారు. బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు నిర్విరామంగా పనిచేసి బిఆర్ఎస్ గెలుపులో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య, వంగేటి లక్ష్మారెడ్డి, చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, నోముల కృష్ణగౌడ్, కందండ లక్ష్మారెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు వేముల అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం : షేక్ అక్బర్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్

**మలక్‌పేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభం తీసుకొచ్చి, ఈ సారి విజయకేతనం ఎగురవేస్తానని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. శుక్రవారం అక్బర్‌బాగ్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అక్బర్ మాట్లాడుతూ ప్రస్తుతమున్న ప్రభుత్వానికి, ఆ పార్టీ మిత్ర పక్షాలకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ అని ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేసి ఈ సారి మలక్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే బలాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేటలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని వివరించారు. నియోజకవర్గంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టి మౌళిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆదరించండి : శాంతిశేఖర్



బీఆర్ఎస్ కరపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ శాంతిశేఖర్

**నాచారం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని చూసి ఆదరించాలని స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాచారంతో పాటు ఓల్డ్ నాచారం, అందేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థిని బిఎల్ఆర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రజలకు అన్ని విధాలుగా అండదండగా ఉంటూ వారి అభివృద్ధికోసం కృషిచేస్తున్న పార్టీ అని పేర్కొన్నారు. డివిజన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, విఠల్‌యాదవ్, ముత్యంరెడ్డి, కురుపాక అంజి తధితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ ఎన్.రాంరెడ్డి తెలిపారు. హబ్సిగూడ పరిధిలోని హెచ్‌ఎంటినగర్ ఫీడర్, ఎన్‌జిఆర్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం పది గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అదే విధంగా హైకోర్టుకాలనీ, బ్యాంక్‌కాలనీ, రవీంద్రనగర్, మహేశ్వరినగర్, జెఎస్ఎన్‌కాలనీ, సత్యనారాయణకాలనీ, స్ట్రీట్‌నెం.8లో ఉదయం 10 గంటలనుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.



త్రిపుర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నల్లు ఇంద్రసేనారెడ్డిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం. (ప్రభాతవార్త, సైదాబాద్)

## బస్తీ దవాఖానాలో వైద్యులు అందుబాటులో ఉండాలి : డిఎంహెచ్ఓ



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి డా.మనోహర్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** బస్తీ దవాఖానాలో వైద్యులు అందుబాటులో ఉండకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డా.మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్, కాప్రా బస్తీ దవాఖానా వైద్యులతో ఆరోగ్య కేంద్రంలో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా.మనోహర్ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించాలని, నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం అధిగమించాలని కోరారు. తెలంగాణ దయాగ్నస్టిక్ అందుబాటులో ఉందని, అన్నిపరీక్షలు చేయాలని, పరీక్షలచేయకుండా వెనక్కి పంపవద్దని కోరారు. ఆరోగ్య కేంద్రంలో మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులపై ఆరోపణలు వస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బస్తీదవాఖానాలో పరికరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మరమ్మతులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హబ్సిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** హబ్సిగూడడివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పరమేశ్వర్‌రెడ్డి పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. హబ్సిగూడ, పుకెట్‌నగర్, ఒయు బస్తీ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కంది ఆగిరెడ్డి, తవిడబోయిన గిరిబాబు, అకారపు అరుణ్‌కుమార్ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి అభివృద్ధికి కృషి చేస్తా : మర్రి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోకజవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని 140 డివిజన్ ఆర్.కె.నగర్‌లో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలోని పేద ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. ప్రజలు తనపై నమ్మకం ఉంచి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ పెద్దబావి వెంకట్‌రెడ్డి కన్నుమూత



పెద్దబావి వెంకట్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, బడంగ్‌పేట్ మాజీ ఉపసర్పంచ్ పెద్దబావి వెంకట్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గత కొంతకాలంనుండి ఆయన కాలేయ వ్యాధి సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి క్షీణించడంతో యశోదా ఆసుపత్రి వైద్యులు శుక్రవారం సాయంత్రం ఇంటికి తీసుకెళ్ళాలని కుటుంబ సభ్యులకు సూచించడంతో వారు బడంగ్‌పేట్‌లోని స్వగృహానికి తరలించారు. అనంతరం ఆయన సాయంత్రం తుది శ్వాస విడిచారు. దీంతో బడంగ్‌పేట్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన అంత్యక్రియలు శనివారం బడంగ్‌పేట్ స్మశానవాటికలో జరుగుతాయి.

## చంద్రగ్రహణం కారణంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మూసివేత

**సైదాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త:** చంద్రగ్రహణం కారణంగా 28వ తేది శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని మూసి వేయడం జరుగుతుందని దేవాలయ కార్యనిర్వాహణాధికారి యం.శ్రీనివాసశర్మ తెలిపారు. 29వ తేది ఆదివారం సం ప్రోక్షణ, అభిషేకము అనంతరం ఉదయం 8 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## బిజెపి గెలుపుకు కృషి చేయాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మునిరత్నం తదితరులు

**వనస్థలిపురం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ శ్రీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన శక్తి కేంద్ర ఇంఛార్జిలు, బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి ఎల్బీనగర్‌లో బీజేపీ పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బియన్‌రెడ్డినగర్‌డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొంతం నవకిషోర్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, కొత్త రవీందర్‌గౌడ్, బొమ్మ రఘురాంనేత తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ల సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే మైనంపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సీనియర్ సిటిజన్లతో కలిసి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, అచ్యుతరావు, పండరి, విజయ్‌కుమార్, రాజలింగం, మనోహర్, పెంటయ్య, సత్యనారాయణ, వీరభద్రయ్య, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లో...** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ దుర్గానగర్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌ఆధ్వర్యంలో కాలనీవాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మైనంపల్లి విచ్చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఆరు పథకాలను వివరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్, సత్యమూర్తి, వెంకటేష్‌యాదవ్, బాబు, సత్యనారాయణ, బి.కే.పార్థసారథి, సతీష్‌కుమార్, బ్రహ్మయ్య, వెంకు, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు సిద్దాల దశరథ గుడ్ బై.. బిజెపిలో చేరిక కోసం అందెలతో భేటీ



అందెలను కలిసిన సిద్దాల దశరథ

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన కీలక బిఆర్ఎస్ నాయకుడు, రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ పార్టీకి గుడ్ బై చెప్పారు. తన వర్గీయులు, అనుచరులతో కలిసి ఆయన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. అతి త్వరలో పెద్ద సంఖ్యలో తన వర్గీయులు, అనుచర గణంతో బిజెపిలో చేరుతానని ఆయన ప్రకటించారు. అయితే బిజెపిలోకి దశరథ రాకను స్వాగతిస్తామని అందెల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దాల ఆగమయ్య, సిద్దాల శ్రీనివాస్, గౌరశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో ఉద్యమకారులకు గుర్తింపు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారులు రఘు, రాందాస్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు లేదని తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ఉద్యమ పార్టీ బిఆర్ఎస్‌లో ఉన్నా ఎలాంటి న్యాయం జరగలేదని ఉద్యమకారులు రఘు, రాందాస్ నయంఖాన్, కొలుముల లక్ష్మణరావు, పార్థసారథి, ఎం.శ్రీనివాస్, జి.ప్రవీణ్, రాజు తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని ఆర్‌కెనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే ఉద్యమకారులు గుర్తుకొస్తారని, తర్వాత ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు బిఆర్ఎస్‌లో లేవన్నారు. ఇతర పార్టీల నుండి చేరిన వారికి ప్రాధాన్యతను ఇస్తుందని, నందిగంటి శ్రీధర్‌కు ఎంబీసీ చైర్మన్ కట్టబెట్టడం, పార్టీకి మూడేళ్లు దూరంగా ఉన్నటువంటి వ్యక్తి సైతం సర్కిల్ అధ్యక్షునిగా ప్రకటించడం ఎంత వరకు సరైందని వారు ప్రశ్నించారు. ఉద్యమకాలను గుర్తించింది మైనంపల్లి హన్మంతరావు అని వారు తెలిపారు. ఆయన మంచితనాన్ని గుర్తించిన ప్రతి ఒక్కరు ఆయనతోనే ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టేది కాంగ్రెస్ పార్టీయేనని, మరికొంత మంది ఉద్యమకారులు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారని వారు తెలిపారు.

## రైతాంగానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి : రావుల శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు

**కుషాయిగూడ, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ రైతులకు అమలు చేస్తున్న రైతుబంధు పథకంగురించి మాజీ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ రావుల శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో కాప్రా క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మరోసారి కాంగ్రెస్ నాయకులకు రైతులమీద ఉన్న కపట ప్రేమ బయటపడిందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వొద్దు 3గంటల కరెంట్ చాలు అంటాడు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దండగ అంటాడు, ఇలాంటివాళ్ళని నమ్మితే రైతులను నట్టేట ముంచేస్తారన్నారు. ఒక్కసారి అవకాశమివ్వమని అడుగుతున్న కాంగ్రెస్‌పార్టీకి 11సార్లు అవకాశమిచ్చినా రైతులకు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీకి రైతుల మీద ప్రేమ ఉంటే ఎలక్షన్ కమిషన్‌కి ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకొని తెలంగాణ రైతాంగానికి, సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## సబితమ్మకు మద్దతుగా బిఆర్ఎస్ నేతల ప్రచారం

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డికి మద్దతుగా పాదయాత్రలు చేస్తూ ఆమె చేసిన అభివృద్ధిపై ప్రచారం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం వారు జిల్లెలగూడలోని డివిజన్లలో తిరిగి కరపత్రాలను పంచుతూ సబితారెడ్డికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, మేకల రవీందర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, గౌరీ శంకర్, సిద్దాల అంజయ్య, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, అర్కల కామేష్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, సిద్దాల బీరప్ప, అబ్బనిమోని గోపియాదవ్, వంటేరు నర్సింహారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అవినీతి పార్టీ... బిజెపికి అడ్రస్ లేదు... : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కమలాసుధీర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** ప్రశ్నించే గొంతుక అంటూ ప్రగల్భాలు పలికి ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దొంగ మాటలు ఎవరు నమ్మరని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట మినర్వా హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ ప్రజలు విద్యావంతులని, చైతన్యవంతులని ఎన్నికలలో ప్రజల మధ్య ఉండే వారికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలో తనపై వ్యక్తిగత నిందలు వేస్తున్నారే తప్ప తాము ఎల్బీనగర్లో అభివృద్ధి చేస్తామని ఎక్కడ చెప్పకపోవడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి గెస్టుగా వస్తున్నవారితో ఎల్బీనగర్‌లో అభివృద్ధి జరగదని గతంలోనే రుజువైందన్నారు. ఎంపీగా గెలిపిస్తే రేవంత్‌రెడ్డి ఎల్బీనగర్లో అభివృద్ధి పనుల్లో పాల్గొనలేదని, ప్రజల కష్టాలు తీర్చలేదని, కేవలం రాజకీయ బ్లాక్‌మెయిల్‌కే ప్రాధాన్యత ఇచ్చాడని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో రూ.1200కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నామని, బస్తి దవాఖానలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఫతుళ్ళగూడలో అంతర్జాతీయ స్థాయిలో స్మశానవాటిక నిర్మించామన్నారు. నియోజకవర్గన్నీ ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సిఎం కెసిఆర్‌ను తనను మూడోసారి గెలిపించి మరింత అభివృద్ధి చేసే అవకాశాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన సతీమణి కమల సుధీర్‌రెడ్డితో కలిసి శుక్రవారం నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జీవీ.సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, రాగిరి ఉదయగౌడ్, సుర్వి రాజుగౌడ్, మధు, ఎమ్మెల్సీ బుగ్గరాపు దయనంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీతప్రశాంత్‌గౌడ్, నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, ప్రమీల, సీతారాములుగౌడ్, చంద్రశేఖర్‌ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామం నుండి అందెల ప్రచారం షురూ

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి అభ్యర్థిగా ఖరారైన అందెల శ్రీరాములు యాదవ్ తన స్వగ్రామం నాదర్‌గుల్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేసి ఆ తర్వాత తన తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకొని ఎన్నికల ప్రచారం ఆరంభించారు. ఈ మేరకు ఆయన స్వగ్రామంలో ఇంటింటికి తిరిగి తనకు మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, గూడెపు ఇంద్రసేన, నాయకులు పెత్తుల్ల పుల్లారెడ్డి, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, ఏనుగు రాంరెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, పోరెడ్డి జగన్మోహన్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా : కెఎంఆర్



ఇండిపెండెంట్‌గా స్వంత మానిఫెస్టోను విడుదల చేసిన కొత్త మనోహర్‌రెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగి పోటీ చేస్తానని కాంగ్రెస్ బహిష్కృత నేత, కెఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి ప్రకటించారు. మంద మల్లమ్మ చౌరస్తా సమీపంలోని సాయినగర్ కాలనీలోనున్న తన నివాసంలో తన వర్గీయులు, అనుచరులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తాను ఎన్నికల పోటీ చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉంటూ మొదట్లో కాంగ్రెస్‌లో ఆ తర్వాత బిఆర్ఎస్‌లో కొనసాగి తన స్వంత డబ్బులతో కెఎంఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించిన తనకు న్యాయం జరగలేదని అన్నారు. ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు చేసి ప్రజల్లో మంచి పేరున్న ఇండిపెండెంట్‌గా గెలిచి తీరుతానని స్పష్టం చేశారు. అనంతరం తన స్వంత మానిఫెస్టోను విడుదల చేశారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రతి పేద కుటుంబానికి 60 గజాల స్థలం, ఆడపిల్లల పెళ్ళిళ్ళకు పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టెలు, గృహోపకరణాలు, ఇంటి స్థలం ఉన్న పేదలకు నిర్మాణం కోసం సాయం, పేద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాలు, పేదలకు అతి తక్కువ ధరలకే గ్యాస్ సిలిండర్లు తదితర సంక్షేమ కార్యక్రమాలు చేస్తానని వివరించారు. తనను గెలిపిస్తే అన్ని హామీలను నెరవేరుస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుల్ల సంతోష్, నర్సింగ్, లింగమయ్య, రాజు, శంకరయ్య, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాచం, కుంట్లూరు

**హైదరాబాద్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నేడు మన్సూరాబాద్ ఎస్.కె.గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారులు కాచం సత్యనారాయణ గుప్త కుంట్లూర్ వెంకటేష్‌గౌడ్‌లు తెలిపారు. ఎల్బీనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంకోసం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్వర్యంలో ఈ సమావేశం కొనసాగుతుందని చెప్పారు. రాజకీయాలకతీతంగా తెలంగాణ ఉద్యమకారులు ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల హక్కులు, ఆకాంక్షలు, సంక్షేమంకోసం ఉద్యమకారులు ముందుకు రావాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న కోరారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమకారులు ఐక్యత చాటాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, బీరెల్లి వెంకటరెడ్డి, యుగంధర్‌శర్మ, ఉదయ్‌గౌడ్, సతీష్‌యాదవ్, సుర్వి రాజుగౌడ్, రాంకోఠి, శాంసుందర్‌గౌడ్, వేద భవానీ, కంతం సైదులు, శ్రవణ్‌కుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.